క్లుప్తంగా

నీట్‌లో పాణ్యం విద్యార్థి ప్రతిభ



కురువ ప్రవల్లిక

పాణ్యం: పాణ్యం గ్రామానికి చెందిన కురువ వేణుగోపాల్, శివలక్ష్మీ రెండో కుమార్తె కురువ ప్రవల్లిక శనివారం వెలువడిన నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. ఆల్ ఇండియా ర్యాంక్ 18897 సాధించింది. ఆమె ఎమ్మిగనూరు బనవాసి పాఠశాలలో పదో తరగతి.. ఇంటర్ విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివింది. వైద్య విద్య పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని విద్యార్థిని పేర్కొంది. కాగా ఆమె అక్క రాజేశ్వరి ప్రస్తుతం తిరుపతి పద్మావతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. తల్లి శివలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

శ్రీకోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



క్రిష్ణదొడ్డి కొండపై పూజలందుకుంటున్న శ్రీవారు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రియమైన రోజు శనివారం కావడంతో ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

కర్నూలు(సెంట్రల్): ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌లో ఎంపికైన ఏడు గ్రామాల్లో 17 శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఎంపికైన మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి, నెరణికి, హొళగుంద మండలంలోని హొళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర, హంప గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద పథకాలు పొందుతున్న లబ్ధిదారుల సంతృప్త స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులకు పక్కాగృహాలు, రోడ్లు, జల జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, యూస్మాన్ భారత్ కార్డులు, కులం సర్టిఫికెట్లు, పెన్షన్లు, గ్యాస్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర రుణాలు, పీఎం విశ్వకర్మ యోజన దితర పథకాలు అందేలా చూడాలని కోరారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన సంక్షేమాధికారి తులసీదేవి, ఆయా మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): వచ్చే నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. జిల్లాలో జరిగే ఆందోళనల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు. పది గంటల పని విధానంతో రాత్రిళ్లు కూడా మహిళలు ఉద్యోగాలు చేయాలా అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణ త్యాగంచేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్‌సాయిబాబ, నారాయాణస్వామి, కె.ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపు

- రెండో ఏడాదైనా అందని పెట్టుబడి సాయం
- పథకం పేరు మార్పుతో సరి
- ప్రభుత్వం నుంచి లభించని భరోసా
- సాయం కోసం అన్నదాతల నిరీక్షణ



ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతన్న



సాగు చేసిన పత్తి పంట

గడివేముల: మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించారు. చాలా మంది దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసి సేద్యాన్ని చేపట్టారు. ఇప్పటికే సుమారు 22 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు మొదలైంది. ఈ పరిస్థితుల్లో వీరికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయం విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.ఈ మొత్తం సాగుకు సన్నద్ధమైన రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుకు కాసింత సహాయ పడనుంది. ఇప్పటికే రైతులు బోర్ల కింద పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటారు. కూటమి ప్రభుత్వం గత ఏడాది పెట్టుబడి సాయం వేయలేదు. గత ప్రభుత్వం పెట్టిన రైతుభరోసా పేరును అన్నదాత సుఖీభవ పేరుగా మార్చింది తప్ప ఆర్థిక సాయం చేయలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందిస్తూ వచ్చింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాలకు జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాలకు జమ చేసేది. అందులో ఖరీఫ్ ఆరంభంలో మొదటి విడత, కోతల సమయంలో రెండో విడత, ధాన్యం ఇంటికి చేరే వేళ మూడో విడత ఇలా రైతుల ఖాతాలకు జమ చేసేది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్లపాటు అందించింది.

కౌలు రైతులకూ..

భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం విడుదల చేసేది. దీంతోపాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని కౌలు రైతుల ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేసింది.

మండలంలో 7165 మంది అర్హులు

మండలంలోని 14 ఆర్బీకేల పరిధిలో రైతు భరోసా పథకానికి 7165 మంది రైతులు అర్హులు ఉన్నారు. కరిమద్దెల 943, కొరటమద్ది 280, కొర్రపోలూరు 650, గడిగరేవుల 539, గడివేముల 358, గని 722, చిందుకూరు 836, చెనకపల్లె 676, తిరుపాడు 278, దుర్వేశి 252, పెసరవాయి 485, బిలకలగూడూరు 543, బూజునూరు 453, మంచాలకట్ట 158 మంది అన్నదాలు గత ప్రభుత్వంలో అర్హులుగా ఉండేవారు.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.2 వేల నగదు చాలవని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ కొలువుదీరి ఏడాదైనా ఇంత వరకు ఎలంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండో ఏడాదైనా సాయం ఇస్తుందని అన్నదాతలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం నుంచి భరోసా లేదు



నాకు 3 ఎకరాల భూమి ఉంది. దీంతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. మొదటి పంటగా మొక్కజొన్న, సోయాబీన్ సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేశాను. సాగు ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంట బీమాను అమలు చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఈ ఏడాదైనా ఎన్నికల హామీని నెరవేర్చాలి.

–ఉశేన్‌భాష, రైతు, గడిగరేవుల

ఎన్నికల హామీని నెరవేర్చాలి



గత ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైన రైతులకు పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేదు. ఖరీఫ్ సీజన్‌లో పంటల పెట్టుబడులకు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నాం. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభంలోనే రైతుభరోసా డబ్బులు నేరుగా మా ఖాతాలో వేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుంది.

–నిరంజన్‌రెడ్డి, పెసరవాయి

అయ్యో! ఇదేమి యోగాంధ్రరా బాబూ!



హైస్కూల్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు, యువతీయువకులు

ఓర్వకల్లు: ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళల పేర్లను బలవంతంగా నమోదు చేయడంతో విధిలేని పరిస్థితుల్లో తీసుకెళ్లి యోగాసనాలు వేయిస్తున్నారు. ఇందులో అధికశాతం వయస్సు మీద పడినవారుకాగా, మరికొందరు అనారోగ్యంతో బాధపడేవారు ఉన్నారు. కొందరు ఊబకాయంతో కూర్చుంటే లేవలేరు, లేస్తే కూర్చోలేని వారు ఉన్నారు. వీరితో సామూహిక యోగాసనాలు చేయించడంతో ‘అయ్యో! ఇది ఏమి యోగాంధ్రరా బాబూ! అంటూ అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన యోగాంధ్ర మాక్ డ్రిల్‌లో కొందరు మహిళలు కూర్చొని లేవలేని స్థితిలో ఇబ్బంది పడ్డారు. స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రమణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరందరితో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్, యోగా అభ్యాసకులు నాగరాజు, భాస్కర్‌రెడ్డి సామూహిక యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రమణయ్య మాట్లాడుతూ.. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి రోజు 30 నిమిషాల పాటు యోగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక విద్యార్థులు, గ్రామ పెద్దలు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



యోగా చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



బీసీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు



సి.బెళగల్‌లో యోగాసనలు సాధన చేస్తున్న అధికారులు

పాణ్యం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న జరిగే యోగాసనాల కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీస్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. మొత్తం 37 ప్రదేశాల్లో యోగా చేశారు. పాణ్యంలోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ యోగా కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఆయుష్ వైద్యురాలు శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు. యోగా దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. యోగాతో అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వెళ్తున్న లక్ష్మీ నరసింహాను అభినందించారు. అలాగే నెరవాడమెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంఈఓ-2సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యోగా మాక్‌డ్రిల్ నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సి.బెళగల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆదోని డివిజన్ డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన భార్గవ రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మండల అధికారులు నిర్వహించిన యోగా ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని యోగా ఆవశ్యకతపై మాట్లాడారు. అనంతరం అధికారులు, సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ తరుణ్, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, వీఆర్వోలు గౌరి, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగా ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం సి.బెళగల్లోని రెగ్యులర్ పాఠశాలలో హెచ్‌ఎం సోమశేఖర్, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



ఆరోగ్య కేంద్రంలో యోగా చేస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

ఓర్వకల్లు: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని వైద్యాధికారులు రేఖ, అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాసనాలు చేశారు. ప్రతి రోజు ఉదయాన్నే 45 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల శరీరానికి ఆక్సిజన్, ఒత్తిడి నుంచి ఉపశమనం, శరీర కండరాలు, కీళ్లు బలోపేతం అవుతాయన్నారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ విలియం రాబర్ట్, ఎంపీహెచ్‌ఎస్ ప్రకాష్, ఏఎన్‌ఎం స్వాతి, ఆయూష్ వైద్యులు జ్యోత్స్న, శైలజ, మునీంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెంచాలి



రక్తదాతను సన్మానిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని వైద్యులు, సిబ్బందిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆసుపత్రి ఆవరణ నుంచి రాజవిహార్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదానంలో కీలక పాత్ర పోషించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలను ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం చేస్తే ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది రక్తంలేక చనిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా తమ రక్తాన్ని బ్లడ్‌బ్యాంకులో దానం చేయాలన్నారు.

తల్లిని వంచించిన కూటమి ప్రభుత్వం



కర్నూలు (టౌన్): తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం రూ.13 వేలు మాత్రమే ఇచ్చి విద్యార్థుల తల్లులను వంచించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితర కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో.. నీకు రూ. 15 వేలు.. నీకు రూ. 15 వేలు అంటూ ఊరూ..వాడా ఊదరగొట్టారన్నారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి రూ. 15 వేలు ఇస్తామన్నారు. చివరకు రూ. 2 వేలు కోత వేయడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. తల్లులను మోసం చేసిన సీఎం చంద్రబాబు క్షమాపణలు చెప్పాలన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

- కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ విజయమనోహరి



మాట్లాడుతున్న విజయమనోహరి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేసే ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని నెల రోజులకు పైగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు శనివారం ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మె చేయడంతో వాటర్ వర్క్స్, పార్కులు, వీధిలైట్ల సమస్యతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. తాత్కాలిక సిబ్బందికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజినీరింగ్ సిబ్బందికి వర్తింపజేయాలన్నారు. అలాగే ఇతర సిబ్బందికి అందుతున్న 69 రోజుల సెలవులను మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ, పార్టీ నాయకులు మల్లికార్జున, బాబు, నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, యాసిన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై ప్రజల మండిపాటు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు మండిపడుతున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యుత్ కోతలు ఉంటే ముందస్తు సమాచారం ఉండేదని, ప్రస్తుతం ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘానికి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు



అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా నియమితులైనట్లు ఉత్తర్వు కాపీలను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖకు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, కే.చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. అడ్‌హాక్ కమిటీలో జి.అబ్దుల్‌హమీద్ (ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు డివిజన్), ఎం.నమేనాయక్ (ఎస్‌సీసీ కమాండెంట్), ఇలియాస్ బాషా (జిల్లా వ్యవసాయ అధికారి), పి.విజయకుమార్ (ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్ ఎస్, జెడ్పీ), ఎస్.షబ్బీర్‌బాషా (సమాచార శాఖ) సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు ఉన్న కార్యవర్గం బైలాను పాటించడం లేదని రాష్ట్ర సంఘం గుర్తించి రాష్ట్ర సంఘం నేతలు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసింది. శనివారం అడ్‌హాక్ కమిటీ సభ్యులు నియామక ఉత్తర్వులను ప్రదర్శించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులైన అబ్దుల్ హమీద్ గతంలో జిల్లా సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంఘంలో కూడా కొనసాగుతున్నారు.

నింగిలో పసిడి కాంతులు



ఆకాశం పసిడి కాంతులతో ప్రకాశిస్తూ కనువిందు చేసింది. ఈ సుందర దృశ్యం శనివారం సాయంత్రం సూర్యుడు అస్తమించే సమయంలో సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి కొండపై కనిపించింది. – సి.బెళగల్